క్లుప్తంగా

రూ.22 లక్షలతో డార్మెటరీ మరమ్మతులు

- గురుకులానికి జోయాలూకాస్ దాతృత్వం



డార్మెటరీ గదులను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ రిజీష్

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం జోయాలూకాస్ ఫౌండేషన్ సహకారంతో రూ.22 లక్షలతో డార్మెటరీ గదులకు మరమ్మతులు చేశారు. గదులు లీకేజీ కాకుండా పనులు చేయడంతోపాటు టైల్స్ వేశారు. మరికొన్ని పనులు చేసి గదులకు కొత్తదనం తీసుకువచ్చారు. ఆదివారం వీటిని ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ రిజీష్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంఈఓ సాయి లీల మాట్లాడుతూ, దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపల్ శోభ, ఫౌండేషన్ మేనేజర్ దేవదాశన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దశావతారాల కవచం సమర్పణ



పుంగనూరు: పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామికి దశావతారాలతో కూడిన రాగి కవచాన్ని పట్టణానికి చెందిన హరినాథ్‌గుప్తా దంపతులు ఆదివారం సమర్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు సమక్షంలో పూజలు చేసి వీటిని అందజేశారు. అనురాధ నక్షత్రం సందర్భంగా శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే నివాళి

గంగవరం: మండలంలోని కలగటూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు హనీఫ్ తండ్రి అబ్దుల్లా ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆ గ్రామానికి వెళ్లి అబ్దుల్లా మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి తదితరులు కూడా నివాళులు అర్పించారు.

అన్నదానం

పలమనేరు:పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్ ఆదివారం తన పుట్టినరోజు పురస్కరించుకుని మూడువేలమందికి అన్నదానం చేశారు.ఆయనకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, రాజంపేట పరిశీలకులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, ఏఎంసీ చెర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, మాజీ కన్వీనర్ మండీ సుధా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


ఆకట్టుకున్న ఖవ్వాలీ

బైరెడ్డిపల్లె: హజరత్ బిస్మిల్లా షాఖాదరి 59వ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఖవ్వాలీ కచేరీ ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బైరెడ్డిపల్లె దర్గా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఖవ్వాలీ ప్రాంగణంలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేయడంతో జనసందోహంతో కిటకిటలాడింది.

'పీఎం సూర్య ఘర్'తో ఇళ్లకు ఉచిత విద్యుత్

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇళ్లకు ఉచిత విద్యుత్ ఇస్తోందని సీఎస్‌సీ మేనేజర్ సతీష్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గతనెల 15 నుంచి ప్రారంభించిందని, ఇందులో భాగంగా ఇంటి పైకప్పులకు సోలార్ ప్యానెళ్లను 40శాతం సబ్సిడీతో అందజేస్తారని తెలిపారు. దీంతో ప్రతినెలా 300 యూనిట్ల సోలార్ కరెంట్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఫలితంగా నెలనెలా గృహ వినియోగానికి వాడే 300 యూనిట్లు ఉచితంగా మారుతుందని తెలిపారు. కావాల్సిన వారు సంబంధిత సీఎస్సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

రామకుప్పం: మండలంలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లో కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో స్టేషను పరిధిలో ఉండాలన్నారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి, ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- రెండు చుక్కలతో నిండు జీవితం
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ





పలమనేరు: పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, వి.కోట: చిన్నారికి పోలియో డ్రాప్స్ వేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా దీనిని చేరుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. స్థానిక విద్యానగర్ బూత్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్‌పోలియోలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. రెండు చుక్కలు వేస్తే చిన్నారులకు నిండు జీవితం ప్రసాదించినట్లేనని ఆయన చెప్పారు. పట్టణంలో 6,181మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేయాలని లక్ష్యంలో 6,074మందికి వేసినట్లు వైద్యులు నిరంజన్‌కుమార్, మాధవి తెలిపారు. పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా,ఆస్పత్రి చెర్మన్ చెంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో 98 శాతం

గంగవరం: గంగవరం, పత్తికొండ పీహెచ్‌సీల పరిధిలో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గంగవరం పీహెచ్‌సీ పరిధిలోని మొత్తం 21 బూత్‌లలో 3284 మంది పిల్లలకు గాను 3218మంది పిల్లలకు, పత్తికొండ పీహెచ్‌సీ పరిధిలో2.518 మంది పిల్లలకు గాను 2,460మందికి పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి తెలిపారు. దండపల్లెలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) శ్రీనివాసులు సందర్శించారు.

6,401 మంది పిల్లలకు..

పెద్దపంజాణి: మండల కేంద్రంతోపాటు రాయలపేట ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలు 6,495 మందికి గాను 6,401 మందికి పల్స్ పోలియో చుక్కలు(98 శాతం) వేశామని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు టి. మురళి, మౌనిక తెలిపారు. రాయలపేటలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహాదారు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరామాపురంలో ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

36,106 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ కేంద్రాల్లోని 22 బూత్‌లలో 36,106 చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ చెప్పారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతి, జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారులు వెంకటప్రసాద్, జయరాయుడు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పల్స్‌పోలియో కేంద్రాలను తనిఖీ చేశారు.

చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు

వి.కోట: పోలియో రహిత సమాజ ఆవిర్భావమే లక్ష్యంగా పుట్టిన ప్రతి శిశువు మొదలుకుని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో నిరోధక చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని పత్రపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఆయన చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. దేశంలో ఏ ఒక్కరూ పోలియో బారిన పడకుండా ఉండాలని ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

పుంగనూరు: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన రాంపల్లెలో మెడికలాఫీసర్ డాక్టర్ సల్మాతో కలసి పోలియో చుక్కలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ నరసింహ ప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా పోలియో చుక్కలు వేశారు. మండలంలో గుర్తించిన 6,011 వేల మంది పిల్లల్లో ఇప్పటి వరకు 5,537 మందికి చుక్కలు వేశారు. ఇందు కోసం 84 సెంటర్లు ఏర్పాటు చేశారు. పట్టణంలో 38 సెంటర్లలో 3953 మంది పిల్లలకు గాను 4,115 మందికి చుక్కలు వేశారు. మిగిలిన వారికి సోమవారం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బందితో చుక్కలు వేయించనున్నట్లు కమిషనర్ తెలిపారు. సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్ భరత్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ వరుణ్, ఎంపీటీసీలు రూపారేఖ, శ్రీరాములుతో పాటు వైద్యసిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా50 కేంద్రాల్లో 4,562 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. బస్సు స్టేషన్లు, రద్దీగా ఉన్న బోయకొండ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. బోయకొండ పాలక మండలి సభ్యుడు పవన్, డాక్టర్ పూజ, ఏఎన్ఎం లత తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో పల్స్ పోలియో 97శాతం నమోదైందని మెడికలాఫీసర్ డా.జానకీరావు తెలిపారు. కల్లూరు పీహెచ్‌సీలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, పాళెంలో జెడ్పీటీసీ సభ్యుడు సీ.మురళీధర్, పులిచెర్ల పీహెచ్‌సీలో కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, మంగళంపేటలో జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా పోలియో చుక్కలు వేశారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 2,800మంది పిల్లలను గుర్తించి వారిలో 98 శాతం మందికి పోలియో చుక్కలు వేశామని డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. మిగిలిన పిల్లలకు ఇళ్ల వద్దకే వెళ్లి చుక్కలు వేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి, ఈఓపీఆర్‌డీ రాజేంద్ర, సర్పంచులు ఇబ్రహింఖాన్, జీవలత, ఎంపీటీసీ నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇది అందరి బాధ్యత

కుప్పం: చిన్నారులు పోలియో బారిన పడకుండా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అందరూ బాధ్యతగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆదివారం కుప్పంలోని పల్స్‌పోలియో కేంద్రాల్లో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కల వేసి మాట్లాడారు. చిన్న వయస్సులోనే పోలియో బారిన పడి జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతున్న వారు ఉంటారని, అవగాహన లేక వారికి పోలియో చుక్కలు వేయించకపోవడమే శాపగ్రస్తమైందన్నారు. ఇలాంటి పరిస్థితి మరే చిన్నారికీ రాకూడదన్నారు. అధికార యంత్రాగంతోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు, క్షేత్రస్థాయి నాయకులందరూ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు



కుప్పం: పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ భరత్

6,706 మందికి పోలియో చుక్కలు

రామకుప్పం: రామకుప్పం పీహెచ్‌సీ పరిధిలో 3,497 మంది, విజలాపురం 2,034 మంది, వీర్నమల పరిధిలో 1,175 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి లోకేష్ తెలిపారు. గోవిందపల్లెలో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, ఆయా పీహెచ్‌సీల పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు పోలియో చుక్కలు వేశారు. .కార్యక్రమంలో వైద్యాధికారులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాచకులకు చుక్కలు వేసి.. కడుపునింపి..

గంగవరం: పల్స్‌పోలియోలో పత్తికొండ పీహెచ్‌సీ వైద్య బృందం చూపిన నిబద్ధత ఈ చిత్రం దర్పణం పడుతోంది. వైద్యాధికారి మల్లిఖార్జునరెడ్డిని పల్స్‌పోలియో మొబైల్ టీమ్‌లో వేశారు. ఆయన సెకండ్ మెడికలాఫీసర్ సర్తాజ్, కమ్యూనిటీ హెల్తాఫీసర్ రవిచంద్రన్‌తో కలిసి కారులో వెళ్తుండగా కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన నంగిలి వద్ద రోడ్డు పక్కన చిత్తుకాగితాలు ఏరుకుంటూ ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో ఆయనకు యథాలాపంగా కనిపించింది. చింపిరిజుత్తు, మట్టికొట్టుకుపోయి, తైల సంస్కారం లేకుండా కనిపించిన వారిని దాటుకుంటూ వెళ్లిన కారును ఆయన వెనక్కు మళ్లించారు. ఆ మాతృమూర్తి వద్ద ఆపి పలకరించారు. వాళ్ల పక్కన పోలియో చుక్కల బాక్స్ పెట్టారు. దీంతో వాళ్లు తమనేదో చేయబోతున్నారని భయపడ్డారు. వైద్య బృందం తమ గురించి చెప్పేసరికి తమకేమీ హాని చేసేవారు కాదని గ్రహించారు..భిక్షాటన చేస్తూ, చిత్తుకాగితాలు ఏరుకుంటూ పిల్లల కడుపు నింపుతున్నట్టు ఆ తల్లి వైద్య బృందానికి చెప్పింది. ఎట్టకేలకు పోలియో చుక్కల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించి ఆమె పిల్లలకు ఆయన చుక్కల మందు వేశారు. అలాగే సమీపంలోని ఒక ఫుడ్ కోర్టుకు తీసుకెళ్లి వారికి అల్పాహారం పెట్టించారు. చేతిలో కొంత నగదు పెట్టారు. వాళ్ల కళ్లల్లో మెరుపులు..మోములో చిరునవ్వులు అవ్యక్తంగా చెప్పకనే చెప్పాయి కృతజ్ఞతను.. తమను ఇప్పటివరకు ఎవరూ ఇలా ఆదరించలేదని! అనంతరం గొర్రెలదొడ్డి అటవీ ప్రాంతంలోని ఇటుక బట్టీల వలస కుటుంబాలు ఉంటున్నాయని తెలుసుకుని అక్కడికి మల్లిఖార్జునరెడ్డి బృందం వెళ్లింది. నాలుగు కుటుంబాలకు చెందిన ఐదేళ్లలోపు చిన్నారులు ఆరుగురికి పోలియో చుక్కలు వేశారు. యాచకురాలి పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ..వారి కడుపు నింపడం తమ బృందానికి ఎంతో సంతోషాన్నిచ్చిందని మల్లిఖార్జునరెడ్డి 'సాక్షి'కిచెప్పారు.



గంగవరం: దండపల్లెలో పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ



పెద్దపంజాణి: పోలియో చుక్కలు వేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి



బైరెడ్డిపల్లె: పోలియో చుక్కలను వేస్తున్న జాయింట్ డైరెక్టర్ దేవసాగర్



యాచకురాలి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి



చౌడేపల్లె: పోలియో చుక్కలను వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ తదితరులు



రొంపిచెర్ల: పోలియో చుక్కలు చేస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి



పుంగనూరు: మున్సిపాలిటీలో పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్, చైర్మన్ తదితరులు



పుంగనూరు: రాంపల్లెలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ, డాక్టర్ సల్మా

ఇక ఎన్నికల సమరమే



హాజరైన నాయకులు, బూత్ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- మళ్లీ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దాం
- చంద్రబాబు కుటిల యత్నాలు, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- 'మా బూత్ సిద్ధం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపు

గంగవరం: అనుభవజ్ఞులు ఎన్నో ఎన్నికలు చేసింటారు.. అయితే ఈ ఎన్నికలు చాలా కీలకం.. అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు, పచ్చమీడియా అండదండలతో అధికారంలోకి రావాలని చంద్రబాబునాయుడు వెంపర్లాడుతున్నారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినంతగా అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలు చరిత్రలో ఏ ప్రభుత్వమూ చేయలేదు.. రానున్న ఎన్నికల సమరంలో మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. ఆదివారం గంగవరంలోని ఓ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం-మా బూత్ సిద్ధం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ, దేశం గర్వించే విధంగా జగనన్న పరిపాలనలో రాష్ట్రంలోని కులమతాలు, పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ మేలు చేశామన్నారు. ఇతర రాష్ట్రాలను సైతం మన పథకాలు ఆకర్షిస్తుంటే, టీడీపీ, జనసేన మాత్రం నిరంతరం బురద చల్లడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. మీ కుటుంబంలో మంచి జరిగింటేనే మాకు ఓటేయండి అనే దమ్మున్న ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరే అని, ఇలా ప్రజల్లోకి వెళ్లి ఓట్లడిగే ధైర్యం టీడీపీకి ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన మంచిని చూసి ఓట్లేసి మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అయితే ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎండగడుతూ మన ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు చాటిచెప్పాల్సిన బాధ్యత కూడా పార్టీ శ్రేణులపై ఉందన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మ్యానిఫెస్టోలో దాదాపు 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో ఏఒక్క హామీ అయినా నెరవేర్చిన పాపానపోలేదని, ఇప్పుడు మరోసారి ప్రజలను హామీలతో వంచిచేందుకు సిద్ధమయ్యాడని విమర్శించారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు 14 ఏళ్ల మోసపూరిత పాలన, మన ఐదేళ్ల ప్రభుత్వంలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు చాటి చెప్పాలని కోరారు. ఏ బూత్‌లో అయితే మెజారిటీ పెరిగిందో ఆ బూత్ కమిటీ సభ్యులకు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో గంగవరం, పలమనేరు, పెద్దపంజాణి, పలమనేరు రూరల్ మండలాల పార్టీ కన్వీనర్లు మోహన్‌రెడ్డి, జాఫర్, బాగారెడ్డి, బాలాజీనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వీ.కోట, పెద్దపంజాణి మండలాల ఎంపీపీలు యువరాజు, రెడ్డెప్ప, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, వినోద్‌రెడ్డి, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాయకుడు ప్రజల్లో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: ప్రజల ఓట్లను కోరే నాయకుడు గ్రామాల్లో పర్యటిస్తూ జనం మధ్యలో ఉండాలేగానీ పొరుగు రాష్ట్రాల్లో కాదని అన్యాపదేశంగా చంద్రబాబునాయుడును ఉద్దేశించి ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆదివారం మండలంలో అబకలదొడ్డి పంచాయతీలోని కాకర్లవంక, వెంకటేష్‌పురంలో ఆయన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కాకర్లవంకలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ 10 లక్షలతో వేసిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం ద్వారా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, నాయకులపై ఉందన్నారు. కానీ కుప్పంలో 35 ఏళ్లుగా గెలుస్తున్న చంద్రబాబు చుట్టపు చూపుగా ఇక్కడికి వస్తూ మెయిన్ రోడ్లలో మాత్రమే పర్యటిస్తున్నారని అపహాస్యం చేశారు. కాకర్లవంక లాంటి గ్రామం ఉందని కూడా స్థానిక ఎమ్మెల్యేకు తెలియదన్నారు. కుప్పం ప్రజల కష్టసుఖాల్లో ఆయన ఏనాడూ పాలుపంచుకోలేదన్నారు. తాను గ్రామాల పర్యటనలో తెలుసుకున్న సమస్యలలో అవకాశం ఉన్న వాటిని పరిష్కరిస్తామన్నారు. విద్యారంగానికి సీఎం ఇచ్చిన ప్రోత్సాహంతో కాకర్లవంక లాంటి మారుమూల గ్రామాల నుంచి కూడా ఉన్నత విద్యావంతులు తయారయ్యారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, నాయకులు చిన్నప్ప, మురుగేష, ఆర్ముగం, చంగమరాజు, పూలకుంట భాస్కర్, విజయకుమార్, చలపతి, కృష్ణ, మోహన్, మణి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: నియోజకవర్గంలో మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్సీ భరత్ ఆర్థిక సాయం చేశారు. ఆదివారం స్థానిక 20 వార్డులో ముత్తు, 24 వార్డులో లక్ష్మీదేవి, కుప్పం మండలం కంగుంది పంచాయతీ రామలగుట్టచేనులో మాయకున్నన్, బలమందుకొట్టాంలో నవీన్ కుమార్, అలాగే శాంతిపురం మండలం శివరామపురంలో తిమ్మక్క, నడింపల్లె క్రిష్ణప్ప కుటుంబానికి రూ.10వేల చొప్పున నగదు అందజేశారు.